సాక్షి
నిజామాబాద్
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



ఎంఐఎం నేత అరెస్ట్..

జిల్లా కేంద్రానికి చెందిన ఎంఐఎం నాయకుడు మునావర్ అలీని గంజాయి కేసులో ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు.

- 10లో ▸



జిల్లాలో భారీ వర్షం

సోమవారం అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. డొంకేశ్వర్ మండలంలో 6.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.8 /22.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

30 నుంచి 'మండలి' ఓటరు నమోదు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలో అర్హులైన ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకోసం ఈ నెల 30 నుంచి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్సీల పదవీకాలం 2025 మార్చి 29 నాటితో ముగియనుందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా అర్హులైన ఓటర్ల పేర్ల నమోదుకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ ఈ నెల 30న నోటీసు జారీ చేసిందని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం నవంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో లేదా ఏఈఆర్‌ఓ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు చేయొచ్చని పేర్కొన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు తెలియజేయాలని, 30న తుది జాబితాను వెలువరిస్తామన్నారు. కరీంనగర్ డీఆర్‌వో ఎన్నికలకు ఈఆర్‌వోగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.

26న జిల్లాస్థాయి యోగా ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాలబాలికల విభాగంలో జిల్లాస్థాయి యోగా ఎంపికలను ఈ నెల 26న కామారెడ్డిలోని యోగా భవన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు 2011 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే అండర్-17 విభాగంలో 2008 జనవరి 1తరువాత జన్మించిన వారు అర్హులని, క్రీడాకారులు తమ వెంట బోనాఫైడ్ తీసుకురావాలని సూచించారు.

రేపు బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు..

నిజామాబాద్‌నాగారం: జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని దుబ్బ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా(కామారెడ్డి, నిజామాబాద్) ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్, కార్యదర్శి శ్యామ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనేందుకు 2005 జనవరి 2వ తేదీ తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్‌లో కామారెడ్డి జిల్లాలో నిర్వహించే 69వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల, బాలికల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

డాక్టర్ పోస్టుల భర్తీకి 28న ఇంటర్వ్యూలు



నిజామాబాద్ నాగారం: జిల్లాలోని బోధన్ జిల్లా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈనెల 28న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వైద్యులు ఈనెల 25నుంచి 27 వరకు జిల్లా కేంద్రంలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బోధన్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, 4 సీఏఎస్, జీడీఎం డాక్టర్ పోస్టులతోపాటు ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. అభ్యర్థులు ఈనెల 28న ఒరిజినల్ సర్టిఫికెట్లతో అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఉదయం 11గంటలకు హాజరుకావాలని సూచించారు.

ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు



ఎస్సారెస్పీ ఏడు వరద గేట్ల ఎత్తివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు మళ్లీ పోటెత్తింది. సోమవారం రాత్రి నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో ముందుగా వరద కాలువ ద్వారా నీటి విడుదలను పెంచడంతోపాటు ఎస్కేప్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో మరింత పెరగడంతో నాలుగు వరద గేట్లను ఎత్తి 12,500 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. మంగళవారం మధ్యాహ్నానికి ఇన్ ఫ్లో 46 వేల క్యూసెక్కులకు పెరగడంతో 7 గేట్లను ఎత్తి 22 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మి కాలువ ద్వారా 50 క్యూసెక్కులనీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న జలాలు



నిజాంసాగర్‌లోకి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 10,105 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి 8,100 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1404.93 అడుగుల(17.701 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

కౌలాస్ గేటు ద్వారా..

జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 671 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి 571 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా ప్రస్తుతం 457.95 మీటర్ల(1.225 టీఎంసీ) నీరు నిల్వ ఉందని తెలిపారు.

నిఘా విభాగాల ఆరా

- జీజీహెచ్‌లో అక్రమాలపై..
- ఆరోగ్యశ్రీలో రూ.10 కోట్ల నష్టం
- వైద్యులు గైర్హాజరైనా అటెండెన్స్, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల రిఫరెన్స్
- ఇష్టారాజ్యంగా ఇంజినీరింగ్ పనులు
- 'సాక్షి' కథనాల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలన



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)పై నిఘా విభాగాలు నజర్ వేశాయి. ఆరోగ్య శ్రీలో జరిగిన రూ. 10కోట్ల నష్టం, వైద్యుల అటెండెన్స్, పరికరాల కొనుగోలు, మెడిసిన్, శానిటేషన్ తదితర అక్రమాలపై ఇంటెలిజెన్స్, విజిలెన్స్, స్పెషల్ బ్రాంచి తదితర నిఘా విభాగాలు ఆరా తీస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా జీజీహెచ్‌లో అసలేం జరుగుతోంది? ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయి? ఎవరి ప్రమేయం.. ఎంత మేర ఉంది? అని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారాలన్నింటిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాల ఆధారంగా ఇప్పటికే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జీజీహెచ్‌పై విచారణ చేపట్టాలని విన్నవించారు.

జీజీహెచ్ ఆరోగ్యశ్రీలో డాటా ఎంట్రీ నిర్లక్ష్యం కారణంగా ఆస్పత్రికి రావాల్సిన రూ.10కోట్లకు పైగా బిల్లులు నిలిచిపోయాయి. అయితే, దీంట్లో ఎవరి ప్రమేయం ఎంత వరకు ఉందనేదానిపై నిఘావర్గాలు పరిశీలిస్తున్నాయి. సరైన పత్రాలను సమర్పించని కారణంగా, 2008 నుంచి 2024 సెప్టెంబర్ 11వరకు సుమారు 4,700 కేసులను ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ఈవో(ఎక్సిక్యూటీవ్) రిజెక్ట్ చేశారు. ఈకారణంగా సుమారు రూ.6కోట్ల వరకు జీజీహెచ్‌కు నష్టం వాటిల్లిది. దీంతోపాటు వైద్యులు రిజెక్టు చేసిన కేసుల కారణంగా రూ.4కోట్ల 27లక్షల 92వేల 792 నష్టం జరిగింది. జీజీహెచ్‌లో పనిచేసే వైద్యులకంటే కమీషన్ల ద్వారానే ఎక్కువ సంపాదించే డాటా ఎంట్రీ ఆపరేటర్ కారణంగానే ఈ పరిస్థితి అని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కమీషన్లు తీసుకునే డాటా ఎంట్రీ ఆపరేటర్ జీజీహెచ్‌కు నష్టం వాటిల్లేలా పని చేసినప్పుడు ఎందుకు రికవరీ చేయడం లేదనే దానిపై నిఘా వర్గాలు దృష్టి సారించాయి.

సిద్ధమవుతున్న నివేదిక

జీజీహెచ్ వ్యవహారాలపై నిఘా వర్గాలు నివేదికను సిద్ధం చేస్తున్నాయి. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పరిశీలన చేపడుతున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో జరగని అక్రమాలు జీజీహెచ్‌లో ఎలా జరుగుతున్నాయనేదానిపై నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇప్పటికే ఇంటెలిజెన్స్ నివేదిక ఉన్నతాధికారులకు అందించారు. జిల్లా కలెక్టర్ సైతం విచారణకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిసింది.

నిఘావర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించిన కొన్ని అంశాలు..

- జీజీహెచ్‌లో కొందరు వైద్యులు సక్రమంగా విధులకు హాజరుకాకున్నా వారికి అటెండెన్స్ వేస్తూ కమీషన్లు తీసుకోవడం.
- ఆరోగ్య శ్రీ విభాగం ఆపరేటరే ఏకంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ ఫోన్ నంబర్ ద్వారా రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయడం. కమీషన్లు దండుకోవడం.
- జీజీహెచ్‌లో టీఎస్‌ఎంఐడీసీ(తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)తో పనులు చేయాల్సి ఉండగా, నిబంధనలు తుంగలో తొక్కి మరీ ఇష్టారాజ్యంగా ఇంజినీరింగ్ పనులు చేపట్టడం. దీనిపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సైతం సీరియస్ అయిన విషయం తెలిసిందే.
- పరికరాలు, మందుల కొనుగోలు, శానిటేషన్ విభాగాల్లో అక్రమాలు.

సర్వేలో ఆధార్ తప్పనిసరికాదు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు, అధికారులు

- పక్కాగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో సీఈవో సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వే సందర్భంగా ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టం ఉంటేనే ఇవ్వొచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కట్టుదిట్టంగా చేపడుతూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్‌ఓ నెట్ 2.0 తదితర అంశాలపై సీఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియ వేగవంతమైందని, వారం రోజుల వ్యవధిలోనే 55 శాతం నుంచి 95 శాతానికి చేరుకుందని అభినందించారు. మరో ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉందని, గడువులోగా ఇంటింటి సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోవద్దన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియను ఓటరు ముసాయిదా జాబితా వెలువరించడానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్ ఉన్న ఫారం-6, ఫారం-6ఏ, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలన్నారు. ఈ నెలాఖరు వరకు అన్ని పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని, వారితో సమావేశాలు నిర్వహించే సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని నోటీసుల ద్వారా కోరాలని సీఈవో సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించండి

- రబీలో నూనె గింజల సాగు మేలు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



తెగుళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

బోధన్: పంటల సస్యరక్షణకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాలని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి రైతులకు సూచించారు. తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంగళవారం సాయంత్రం బోధన్, సాలూర మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే.. రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం, వరి చెరుకు పరిశోధన కేంద్రం, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పెంటాకుర్దు క్యాంప్, సాలూర గ్రామ శివార్లలోని వరిని ఆశించిన ఆకు ఎండు తెగులును పరిశీలించారు. సాలూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెగుళ్ల నివారణపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు. రబీలో నూనె గింజల పంటలైన సన్‌ఫ్లవర్, నువ్వులు, కుసుమలు, వేరుశెనగ సాగు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మంచి నూనెను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉందని, ఆ నూనె సైతం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో ప్రజలు గానుగ నూనెను మళ్లీ వాడే పరిస్థితి ఏర్పడిందన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన బ్యాంకు బకాయిలు చెల్లించామని పేర్కొన్నారు. చెరుకు పంట సాగుకు రైతులు ముందుకు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర కో ఆపరేటీవ్ యూనియన్ ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, ఏడీఏ వాజీద్ హుస్సేన్, శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, విజయ్‌కుమార్, ఏవో సంతోష్, తహసీల్దార్లు విఠల్, శశిభూషణ్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, అల్లె రమేశ్, మందర్న రవి, గణపతిరెడ్డి, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ఉద్రిక్తత



జీవదాన్ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు



ఎస్సై రాజారాంను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- జీవదాన్ స్కూల్‌పై రాళ్ల దాడి.. పోలీసుల లాఠీచార్జి

కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్న ఆరేళ్ల చిన్నారిపై పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదుచేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం వెలుగులోకి రావడంతో విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఫర్నిచర్ ధ్వంసం చేసి, పాఠశాలకు తాళం వేసేందుకు యత్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆందోళన కారులకు మద్దతు తెలిపారు. పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు పాఠశాల భవనంపై రాళ్లు రువ్వడంతో కిటికీలు, అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులపైనా రాళ్లు పడడంతో పరిస్థితి అదుపు తప్పింది. సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తలకు గాయంకాగా, హెడ్ కానిస్టేబుల్ అమీనుద్దీన్ కుడి కాలు విరిగింది. పట్టణ ఎస్సై రాజారాం సొమ్మసిల్లి పడిపోయారు. ఎస్పీ సింధు శర్మ ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళకారులను సముదాయించారు.

మెంబర్‌షిప్ డ్రైవ్‌లో భాగస్వాములు కావాలి

- ప్రతి బూత్‌లో 100 మందిని చేర్చడమే లక్ష్యంగా పని చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి



మాట్లాడుతున్న దినేశ్ కులాచారి

సుభాష్‌నగర్: బీజేపీ ఆధ్వర్యంలో రాబోయే 48 గంటలపాటు చేపట్టనున్న మెగా మెంబర్‌షిప్ డ్రైవ్ కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులతో పాటు బూత్, మండల, మోర్చాల ప్రతినిధుల వరకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతి సందర్భంగా 25వ తేదీన మెగా మెంబర్‌షిప్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ప్రతిబూత్‌లో 100మంది సభ్యత్వం పూర్తి చేయాలని, అలాగే దీన్‌దయాల్ జయంతిని ప్రతి బూత్‌లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 6.54లక్షల సభ్యత్వం కాగా, నిజామాబాద్‌లో 50వేల పైచిలుకు సభ్యత్వం పూర్తయ్యిందని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ముందు స్థానంలో ఉందని, ఆ తర్వాతి స్థానాల్లో నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు.

రుణమాఫీని అందరికీ వర్తింపజేయాలి

జిల్లాలో 2.72లక్షల మంది రైతులు రుణాలు తీసుకోగా, కేవలం 85వేల మందికి మాత్రమే రుణమాఫీ వచ్చిందని దినేశ్ అన్నారు. ఏ గ్రామానికెళ్లినా తమకు రుణమాఫీ కాలేదని రైతులు వినతిపత్రాలు ఇస్తున్నారని, క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలు సేకరించి అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలన్నారు. సమావేశంలో సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ పుప్పాల శివరాజ్, నాయకులు గద్దె భూమన్న, సంతోష్, న్యాలం రాజు, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, రచ్చ సుదర్శన్, బద్దం కిషన్, నక్క రాజేశ్వర్, సవిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మండలానికి ఇన్‌చార్జి ఎంఈవో

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో ఎట్టకేలకు ప్రతి మండలానికి ఇన్‌చార్జి ఎంఈవోల నియామకం జరిగింది. గత 15 సంవత్సరాలుగా జిల్లాలో ఎంఈవోల కొరత తీవ్రంగా ఉండేది. ఒక్కో అధికారి ఐదారు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవో వ్యవహరించేవారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈవోల కొరతను తీర్చేందుకు ఆయా పాఠశాలల పరిధిలోని సీనియర్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఎమ్‌ఈవో బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మండలం	ఎంఈవో
నిజామాబాద్ నార్త్	వెంకటనారాయణగౌడ్
నిజామాబాద్ సౌత్	ఎం సాయారెడ్డి
మోపాల్	కేమ్‌సింగ్
ధర్పల్లి	రమేశ్‌కుమార్
ఇందల్వాయి	శ్రీధర్
ఆర్మూర్	రాజగంగారాం
కమ్మర్‌పల్లి	ఆంధ్రయ్య
జక్రాన్‌పల్లి	శ్రీనివాస్
బాల్కొండ	రాజేశ్వర్
కోటగిరి	శ్రీనివాసరావు

రెంజల్	గణేశ్‌రావు
వేల్పూర్	టి రేణుక
మాక్లూర్	కె సత్యనారాయణ
భీమ్‌గల్	ఎ స్వామి
ఆలూరు	ఎం నరేందర్
డిచ్‌పల్లి	శ్రీనివాస్‌రెడ్డి
నందిపేట	ఎ గంగాధర్
డొంకేశ్వర్	బి రామకృష్ణ
మోర్తాడ్	తమ్మిరెడ్డి

ముప్కాల్	రవికుమార్
మెండోరా	డి శ్రీనివాస్
పోతంగల్	ఎల్ శంకర్
బోధన్	నాగయ్య
సాలూర	రాజీమజుషా
ఎడపల్లి	కె సాయిలు
వర్ని	సాయన్న
రుద్రూర్	కట్ట శ్రీనివాస్
మోస్రా	నాగనాథ్
చందూరు	ఎ శ్రీనివాస్‌రెడ్డి
నవీపేట	ఎస్ అశోక్

క్లుప్తంగా

డీపీవోకు సన్మానం



సుభాష్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న చక్రవర్తి తరుణ్‌కుమార్‌కు నగర శివారులోని ఓ హోటల్‌లో కార్యాలయ సిబ్బంది, ఎంపీవోలు మంగళవారం ఘన వీడ్కోలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏడు నెలలు డీపీవోగా ఆయనతో కలిసి పనిచేసిన అధికారులు, సిబ్బంది తనతో అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం తరుణ్‌కుమార్‌ను డీఆర్డీవో సాయాగౌడ్, జెడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్ రావు, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, డీపీవో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవోలు శివకుమార్, మధుకర్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీవోలు ఇక్బాల్, మధురిమ, డీపీవో కార్యాలయ సిబ్బంది కృష్ణ కుమార్, రాజబాబు, సంగ్రామ్, ఆదిత్య, శ్రీనివాస్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): ప్రపంచీకరణ నేపథ్యంలో మేనేజ్‌మెంట్ విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత మెరుగు పర్చుకోవాలని తెయూ ప్రొఫెసర్ యాదగిరి సూచించారు. మంగళవారం తెయూ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'సిగ్నిఫికెన్స్ ఆఫ్ స్పెషలైజేషన్స్ ఇన్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వివిధ ప్రత్యేక మార్కెటింగ్ నైపుణ్యాలలో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. సెమినార్ డైరెక్టర్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి సీహెచ్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రత్యేక నైపుణ్యాల ఎంపికలో పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డీన్ ప్రొఫెసర్ అపర్ణ, ఎంబీఏ అధ్యాపకులు ప్రొఫెసర్ ఖైసర్ మహమ్మద్, రాజేశ్వరి, వాణి తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ప్రొఫెసర్ రాంబాబు, రవీందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, కిరణ్‌రాథోడ్, క్యాంపస్ విద్యార్థులు, ఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

- తడిసిన వడ్లు, నేలకొరిగిన వరి
- డొంకేశ్వర్‌లో ఆరున్నర సెంటీమీటర్ల వాన

డొంకేశ్వర్: వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. నిజామాబాద్ రూరల్, ఎడపల్లి, సిరికొండ, ఆర్మూర్, ఆలూరు, ముప్కాల్, నవీపేట్, సాలుర, రెంజల్, నందిపేట్, డొంకేశ్వర్, బాల్కొండ, బోధన్, మెండోరా, ముప్కాల్ మండలాల్లో పంటలకు నష్టం జరిగింది. కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన మక్క, వరి, సోయా పంట తడిసిపోయింది.



మక్కలపై కప్పి ఉంచిన టార్పాలిన్లు



తొండాకూర్‌లో వర్షానికి తడిసిన మక్కలు

రైతులు ముందస్తుగా టార్పాలిన్లు కప్పినా లోపలికి నీరు చేరింది. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు మంగళవారం రోజంతా శ్రమించారు. భారీ వర్షానికి చేతికొచ్చిన వరి పొలాల్లోనే నేల వాలింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి అత్యధికంగా డొంకేశ్వర్ మండలంలో ఆరున్నర సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఈ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. దీంతో మండల వ్యాప్తంగా కోసి ఆరబోసిన మక్క, సోయా పంటలు తడిశాయి.

పిడుగుల మోత

- కాలిపోయిన టీవీలు, ఫ్రిడ్జీలు

డొంకేశ్వర్: సోమవారం అర్ధరాత్రి భారీ పిడుగులతో కూడిన వర్షం కురిసింది. డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామంలో పిడుగుల మోత మోగింది. చిన్న బోజారెడ్డి ఇంటిపై పిడుగు పడడంతో స్లాబు దెబ్బతిన్నది. ఇంట్లోని టీవీ, ఫ్రిడ్జి, గృహోపకరణాలు కాలిపోయాయి. చుట్టుపక్కల ఇళ్లలో కూడా టీవీలు, ఫ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. మండల వ్యాప్తంగా భారీ పడిగులు పడడంతో ప్రజలు భయందోళనకు గురయ్యారు.



పిడుగుకుపాటుకు ధ్వంసమైన స్లాబు





కాలిపోయిన ఫ్రిడ్జి, టీవీ

పిడుగుపాటుకు వృద్ధురాలి మృతి



నవీపేట: మండలంలోని యంచలో మంగళవారం వేకువజామున పిడుగు పాటు శబ్దానికి లక్ష్మీబాయి(61) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అంతే కాకుండా గ్రామంలోని నలుగురి ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయాయి.

నిజామాబాద్ మార్కెట్ యార్డులో..

సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నిజామాబాద్ మార్కెట్ యార్డులో షెడ్డులో నిల్వ ఉంచిన మక్కలు వర్షానికి తడిసిపోయాయి. షెడ్డు లోపలికి వర్షపు నీరు రావడంలో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. షెడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, నీరు లోపలికి రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన మక్కలు

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: శిక్షణ, ఉద్యోగ కల్పన కోసం వృత్తి శిక్షణ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనారిటీలకు మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా ఐటీ ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటెంట్, వెటర్నరీ, డైరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చరల్, టూరిజం, హాస్పిటల్, డ్రైవింగ్ ఎలక్ట్రానిక్స్, స్కిల్ ఎంప్లాయిమెంట్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు శిక్ష ణ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను అక్టోబర్ 4 లోగా మేనేజింగ్ డైరెక్టర్ టీజీఎంఎఫ్‌సీ హైదరాబాద్ లోని నాంపల్లిలో ఉన్న మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బ్రోచర్ల ఆవిష్కరణ

తెయూ(డిచ్‌పల్లి): జాతీయ సైన్స్ వేడుకల్లో భాగంగా తెయూ భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో ఈనెల 26న 'జంతుజాల సంరక్షణ–విధాన రూపకల్పన' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నశీల తెలిపారు. ఈమేరకు మంగళవారం తెయూలో కార్యక్రమ బ్రోచర్స్‌ను తెయూ రిజిస్ట్రార్ యాదగిరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కోఆర్డినేటర్ చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ జట్టు కోచ్‌గా శ్యామ్



శ్యామ్

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర బాలుర బ్యాడ్మింటన్ జట్టు కోచ్‌గా శ్యామ్ ఎంపికయ్యారు. హర్యానాలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించే 43వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల, బాలుర బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ ఎంపికయ్యారని సంఘం జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్ తెలిపారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా శ్యామ్ నియామకంపై జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, రంజిత్, నర్సయ్య, కిశోర్, రాజ్ కుమార్, కిషన్, సంజీవ్, కృష్ణమూర్తి, రాజేశ్వర్, నాగేశ్, సురేందర్, సాయిబాబా, మాధురి, సురేష్, వినోద్, భాగ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేశ్, రాజేశ్వర్, నాగేశ్, నరేందర్, ప్రేమ్ కుమార్, రమణ, సంతోష్ ఠాగూర్ హర్షం వ్యక్తం చేశారు.

బీఈడీ నూతన సిలబస్‌పై అవగాహన సదస్సు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని అనుబంధ బీఈడీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో నూతన సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు వర్సిటీ ఆడిట్‌సెల్ అధికారులు తెలిపారు. ఈ మేరకు నూతన సిలబస్‌పై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ నెల 25న ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో ఉమ్మడి సిలబస్ అమలవుతుందన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ బీఈడీ కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్‌లు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరి, బీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్ సాయిలు, పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు.

అన్నదాత అభిమానం

సిరికొండ: వ్యవసాయంపై ఉన్న మక్కువతో ఓ అన్నదాత తన బైక్‌పై చిన్న నాగలిని ఏర్పాటు చేసుకున్నాడు. తాటిపల్లి గ్రామానికి చెందిన మందాల లక్ష్మణ్ వ్యవసాయం చేస్తుంటాడు. వ్యవసాయానికి రోల్ మోడల్‌గా ఉండటానికి కర్రతో చేసిన చిన్న నాగలిని తన బైక్‌పై ఏర్పాటు చేసుకొని అన్నదాతగా అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.



బస్సు నుంచి పడి విద్యార్థినికి తీవ్రగాయాలు



లింగంపేట: బస్సు నుంచి కిందికి దిగుతున్న ఓ విద్యార్థిని కింద పడి తీవ్రగాయాలైన ఘటన లింగంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. లింగంపేటకు చెందిన విద్యార్థిని సంపంగి కావ్య ఎల్లారెడ్డిలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. కావ్య ఉదయం కళాశాలకు వెళ్లేందుకు బస్టాండులో బస్సు ఎక్కింది. బస్సు అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తుండగా కావ్య తల్లి దుర్గవ్వ సైతం ఎల్లారెడ్డి ఆస్పత్రికి వెళ్లేందుకు చౌరస్తాకు రాగా తల్లి కోసం బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరింది. అయినా బస్సు ఆపకుండా ముందుకు వెళ్లడంతో కావ్య బస్సు దిగే ప్రయత్నంలో అదుపుతప్పి ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్సులో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తోనే సమాజంపై అవగాహన

తెయూ(డిచ్‌పల్లి): ఎస్‌ఎస్‌ఎస్‌తోనే విద్యార్థులకు సమాజంపై అవగాహన కలుగుతుందని జిల్లా మహిళా, శిశుసంక్షేమ అధికారి రసూల్ బీ పేర్కొన్నారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆమె ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రధానంగా సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. స్త్రీలు, శిశు సంక్షేమానికి సంబంధించిన సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తెయూ ప్రిన్సిపాల్ ఆరతి, తెయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారులు స్వప్న, స్రవంతి, అధ్యాపకులు, వలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రసూల్ బీ

విద్యుత్‌షాక్‌తో ఏఎల్‌ఎంకు గాయాలు



బాధితుడిని పరామర్శిస్తున్న ఎస్‌ఈ రవీందర్

సుభాష్‌నగర్: నగరంలోని డీ8 నాగారం సెక్షన్‌లో ఇంద్రాపూర్ కాలనీలో డీటీఆర్(ట్రాన్స్‌ఫార్మర్)లో తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు వచ్చిన ఏఎల్‌ఎం నడిపి నాగన్న విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో రాత్రి విధుల్లో ఉన్న ఏఎల్‌ఎం, లైన్‌మన్‌కు డీటీఆర్‌లో సమస్య ఉందని సమాచారమందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన ఏఎల్‌ఎం మొదట ఏబీ స్విచ్‌ను నిలిపేశారు. మరమ్మతులకు డీటీఆర్‌పైకి వెళ్లిన నడిపి నాగన్న విద్యుత్‌షాక్ తగిలి గాయపడ్డాడు. వెంటనే ఆయనను జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలియగానే విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్, డీఈ శ్రీనివాస్, ఏడీఈలు వీరేశం, తోట రాజశేఖర్, ఏఈలు ఆస్పత్రికి చేరుకొని బాధితుడిని పరామర్శించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తరలించారు.

లైన్‌మన్‌పై వేటు

నగరంలోని నాగారం డీ8 సెక్షన్ లైన్‌మన్ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ డీఈ శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంద్రాపూర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లు సమాచారం రావడంతో ఏఎల్‌ఎం నడిపి నాగన్నతో అక్కడికి చేరుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసే క్రమంలో నడిపి నాగన్న విద్యుత్ షాక్‌కు గురై గాయాలయ్యాయి. ఈ ఘటనలో విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు లైన్‌మన్ మోహన్‌ను సస్పెండ్ చేశారు. మోహన్ గతంలో కూడా పలుమార్లు సస్పెండ్ అయినట్లు తెలిసింది.

క్రైం కార్నర్

దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఒకరిపై దాడిన చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన మాధవ్ ఆగస్టు 28న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఓ కిరాణ దుకాణం ఎదుట నిలుచున్నాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన పవన్ మద్యం మత్తులో ప్రజలపై ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నాడు. అలా చేయొద్దని మాధవ్ పవన్‌ను మందలించాడు. దీంతో కోపంలో పవన్ తన చేతికి ఉన్న కడియంతో మాధవ్ కంటిపై దాడి చేశాడు. ఈ ఘటనలో మాధవ్ కంటికి బలమైన గాయం కావడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ప్రజలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

మహిళను కాపాడిన పోలీసులు

బాల్కొండ: ఎస్సారెస్పీలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన ఎరుకల పద్మను మెండోరా పోలీసులు ప్రాణాలతో కాపాడారు. ఎస్సై నారాయణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పని చేసుకుంటు జీవనం సాగించే పద్మ కుటుంబ కలహాలతో ప్రాజెక్ట్‌లో దూకి ఆత్మహత్య చేసుకోడానికి సోమవారం రాత్రి ప్రాజెక్‌కు వచ్చింది. విషయం గమనించిన ప్రాజెక్ట్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. తాము వెంటనే ప్రాజెక్ట్ వద్దకు చేరుకొని ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

బోధన్‌టౌన్: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి మంగళవారం తీర్పును వెల్లడించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం పట్టణంలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించి పట్టుకున్నామని అన్నారు. వీరిని బోధన్ కోర్టులో సెకండ్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి నూతన చట్టాల పరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఒకరిపై కేసు నమోదు

బాన్సువాడ: పట్టణంలోని ధనుంజయ్ ట్రేడర్స్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆస్ట్రాల్ కంపెనీకి చెందిన పైపులను కాకుండా అదే పేరుతో నకిలీ పైపులను ధనుంజయ్ ట్రేడర్స్‌లో విక్రయిస్తున్నట్లు ఆస్ట్రాల్ కంపెనీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల 10న కంపెనీకి సంబంధించిన వ్యక్తి వచ్చి ఓ పైపును కొనుగోలు చేశాడు. సదరు వ్యక్తి కొనుగోలు చేసిన పైపును టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపించారు. నకిలీ పైపు అని తేలడంతో కంపెనీ ప్రతినిధులు ఈ నెల 23న బాన్సువాడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ధనుంజయ్ ట్రేడర్స్ యాజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తొండాకూర్‌లో మహిళకు పాము కాటు



డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్ గ్రామానికి చెందిన మహిళ పాము కాటుకు గురయ్యారు. మాక్లూర్ మండలం బోర్గాం (కె) గ్రామానికి చెందిన ర్యాపని లక్ష్మి కొంత కాలంగా తొండాకూర్‌లో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. పామును గమనించిన కుటుంబీకులు దానిని చంపేశారు. పాము కాటుకు గురైన లక్ష్మిని వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: మహిళ హత్య కేసులో మరో మహిళతో పాటు ఓ వ్యక్తికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అత్యాచారాలను నివారించే ప్రత్యేక న్యాయస్థానం స్పెషల్ జడ్జి టి శ్రీనివాస్ మంగళవారం తీర్పువెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ముదెల్లికి చెందిన ఒడ్నాల అంజయ్య, కాశమణి భార్యాభర్తలు. అంజయ్య గాంధారి మండలం జీకే తండాకు చెందిన అరుణతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. తన భర్తకు, అరుణకు ఇది సరైంది కాదని వారికి చెప్పినా వారిలో మార్పు రాలేదు. దీంతో అరుణతో తమ కుటుంబంలో గొడవలు జరుగుతాయని భావించి కాశమణి ఆమెను అంతం చేయాలని భావించింది. అరుణ హత్యకు సాయం చేయాలని అదే గ్రామానికి చెందిన సుతారి చిన్న బాలయ్యను కాశమణి కోరింది. దీంతో అతను రూ. 5 వేలు ఇస్తే సహకరిస్తానని చెప్పాడు. వీరు పథకం ప్రకారం 2019ఆగస్టు29న బస్సులో వెళ్తున్న అరుణను అనుసరించారు. బాన్సువాడ మండలం గాలిపూర్ గేట్ దగ్గర బస్ దిగి నిజాం సాగర్ కెనాల్ కట్టపై నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో తాడుతో అరుణ మెడకు బలంగా బిగించి ఊపిరాడకుండా చేశారు. బండరాళ్లతో తలపై మోది హత్య చేశారు. విచారణలో వీరు నేరం చేసినట్లు రుజువు కావడంతో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం సెక్షన్ 3(2)(వి) ప్రకారం జడ్జి వారికి జీవిత కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజుల జైలుశిక్ష అనుభవించాలని, ఈ శిక్షాలన్ని ఏకకాలంలో అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

నవీపేట: మండలంలోని మహంతం గ్రామానికి చెందిన జాలరి భూమన్న(61) చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందాడని ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామ శివారులోని కండ సంద్రం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన భూమన్న ఇంటికి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం చెరువులో గాలించగా మంగళవారం ఉదయం లభ్యమైంది. కాలికి వల చిక్కుకోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హున్సాలో..

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని హున్సా గ్రా మానికి చెందిన మల్లారం సాయిలు(43) అనే జా లరి మందర్నా శివారులోని రాంసాల చెరువులో చేపల వేటకు వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. సోమవారం సాయంత్రం హున్సా నుంచి మందర్న శివారులోని రాంసాల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు మంగళవారం పలు చోట్ల గాలించగా చెరువులో మృతదేహం కనిపించింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పంటలను ధ్వంసం చేసిన అడవి పందులు

లింగంపేట: మండలంలోని పర్మళ్ల గ్రామంలో రాజాగౌడ్‌కు చెందిన వరి పంటను అడవి పందులు సోమవారం రాత్రి ధ్వంసం చేశాయి. అడవి పందులు రాత్రి వేళ గుంపులు, గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసినట్లు బాధితుడు తెలిపాడు. సుమారు ఎకరం వరి పంట చేతికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయాధికారులు ధ్వంసం చేసిన పంటను పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతు రాజాగౌడ్ కోరుతున్నాడు.

బాలుడి అదృశ్యం



బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన షేక్ రిహాన్ అనే పదహారేళ్ల బాలుడు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాకాసీపేట్‌కు చెందిన రిహాన్ సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సిర్‌పూర్ తండాలో ఏసీపీ విచారణ

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ తండాలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ఇటీవల తండాకు చెందిన గుండు నాయక్ బొడ్డు గంగారెడ్డి భూమిని కౌలు చేస్తున్నాడు. ఆ పక్కనే రాజారెడ్డికి చెందిన వ్యవసాయ భూమి ఉంది. తన భూమిని కబ్జా చేసి సాగు చేశాడనే నెపంతో రాజారెడ్డి.. గుండు నాయక్ చేస్తున్న భూమిని పూర్తిగా దున్నేశాడు. అంతటితో ఆగకుండా కులం పేరుతో దూషించాడు. దీంతో కోపోద్రోక్తుడైన గుండు నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. ఆ మేరకు మంగళవారం ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి విచారణ చేశారు. ఆయన వెంట ఎస్సై యాదగిరి గౌడ్ ఉన్నారు.

పాల్వంచలో గుడిసె దగ్ధం

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో నాందేటి రమేశ్‌కు చెందిన నివాసపు గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం దగ్ధమైంది. గుడిసెలో నగదు, వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. ఈ ఘటనతో రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. గుడిసె దగ్ధంతో తాము రోడ్డున పడ్డామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరారు.

పేకాట స్థావరంపై దాడి

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడులు చేపట్టిన పోలీసులకు ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.14,800 నగదుతో పాటు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు పేర్కొన్నారు.

పాతంగల్‌లో..

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పాతంగల్ మండలం టాక్లీ శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ మంగళవారం పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామ శివారులోని పేకాట స్థావరంపై దాడి చేయగా నలుగురు పట్టుబడగా వారి నుంచి రూ. 10,740 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి శివారులోని మైసమ్మ ఆలయ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. మృతుని వయస్సు 35–40 ఏళ్ల మధ్య ఉంటుందని దేవునిపల్లి ఎస్సై మధుసూధన్ రెడ్డి తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నీలి రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంట్ కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎవరైనా అతడి ఆచూకీ తెలిస్తే దేవునిపల్లి పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

చికిత్స పొందుతూ మరొకరు..

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్‌లో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలో ఉన్న 35 ఏళ్ల వ్యక్తిని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరించారు. జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి ఒంటిపై బ్లూకలర్ జీన్స్ ప్యాంట్, గోధుమ రంగు కలర్ బనియన్ ఉందన్నారు. మృతుడి గురించి ఎవరికైనా వివరాలు తెలిస్తే 87126 59870 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.